జీవన విధానం మార్పుకు విద్యే సరైన ఆయుధం

అసిస్టెంట్ ఇంజినీర్ కంకణాల సుబ్బారావు



చెంచుకాలనీలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న కంకణాల సుబ్బారావు

పెదకాకాని: విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ఇంజినీర్ కంకణాల సుబ్బారావు అన్నారు. పెదకాకాని మండలం వెనిగండ్ల చెంచుకాలనీలో శనివారం చెంచుల జీవన విధానం విద్య అవగాహన కార్యక్రమం జరిగింది. స్కోఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కంకణాల సుబ్బారావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఏఈ సుబ్బారావు మాట్లాడుతూ విద్య ద్వారానే కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతి తల్లిదండ్రులు పిల్లల్ని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డి కొండలరావు మాట్లాడుతూ కాలనీలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటువ్యాధులు దరి చేరకుండా ఉంటాయన్నారు. జీవన విధానం మారాలంటే విద్య ద్వారానే సాధ్యపడుతుందన్నారు. అనంతరం దాతల సహకారంతో చెంచుకాలనీవాసులందరికీ దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అన్నమ్మ, వనమా రవిబాబు, నాగరాజు, జయలక్ష్మి పాల్గొన్నారు.

ఒంగోలు జాతి పశుపోషకులకు ప్రభుత్వ ప్రోత్సాహం



జాతీయ స్థాయి ఒంగోలు జాతి బండలాగుడు పోటీల్లో సత్తా చాటుతున్న కోడెగిత్తలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, డీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు

- రైతులకు వెన్నుదన్నుగా రాష్ట్ర ప్రభుత్వం
- రసవత్తరంగా సాగుతున్న వృషభరాజముల బండ లాగుడు పోటీలు
- నేటితో ముగియనున్న ఒంగోలు జాతి ఎడ్ల పందాలు

పెదకాకాని: ప్రభుత్వం పశు పోషకులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామ శివార్లలో ప్రారంభమైన ఐదురోజుల జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల బండ లాగుడు ప్రదర్శనలు రసవత్తరంగా సాగుతున్నాయి. జాతీయ రహదారికి అతి సమీపంలో ఉత్సాహ భరితంగా నిర్వహిస్తున్న ఒంగోలు గిత్తల ప్రదర్శనలు తిలకించేందుకు పెద్ద ఎత్తున రైతులు, ప్రజలు తరలివస్తున్నారు. నాలుగవ రోజు శనివారం సబ్‌జూనియర్స్ విభాగంలో జరిగిన పోటీలకు ముఖ్యఅతిథులుగా పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, గుంటూరు నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు, డీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు(లాలుపురం రాము)లు విచ్చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ ఒంగోలు జాతి గిత్తలను వృద్ధి చేస్తున్న రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ప్రపంచ దేశాలలో పేరు ప్రఖ్యాతులు ఉన్న ఒంగోలు జాతి గిత్తలను కాపాడాల్సిన బాధ్యత రైతు సోదరులపై ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పశు పోషకులను, సంపదను, ప్రదర్శనలను ప్రోత్సహిస్తున్నారన్నారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుందని భావించిన సీఎం లాభసాటి వ్యవసాయం దిశగా వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.

రైతన్నలకు వెన్నుదన్నుగా...

అన్నదాతకు వెన్నుదన్నుగా నిలిచి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. రైతు భరోసా పథకం ద్వారా అన్నదాతలకు ప్రతి ఏటా పంటల పెట్టుబడి సమయంలో వారి బ్యాంక్ ఖాతాలకు నగదు జమ చేయడం జరిగిందన్నారు. అలానే వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రైతులకు వేల కోట్ల రూపాయలు రుణాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. పెద్ద ఎత్తున రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఎడ్ల జతలను ఒకచోటకు చేర్చి ప్రదర్శనలు నిర్వహిస్తున్న కొప్పురావూరు పీఏసీఎస్ అధ్యక్షుడు తోట శ్రీనివాసరావును అభినందించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఎడ్ల పందాలు నాలుగు పళ్ళ విభాగం, ఆరు పళ్ళ విభాగం, వ్యవసాయ విభాగం, సబ్ జూనియర్స్ విభాగాలలో పోటీలు పూర్తి కాగా ఆదివారం చివరిరోజు సీనియర్స్ విభాగంలో బండ లాగుడు పోటీలు జరుగుతాయన్నారు. ఒంగోలు జాతి పశు సంపదను కాపాడుతున్న పశు పోషకులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. పోటీలకు పశువులతో వచ్చిన రైతులను సత్కరించారు. అతిథుల చేతుల మీదుగా వ్యవసాయ విభాగంలో విజేతలకు మెమెంటో నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమములో పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, గుంటూరు నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు, డీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు(లాలుపురం రాము), గ్రామ సర్పంచ్ ఆలా సాంబశివరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ విన్నకోట పూర్ణశంకరరావు, చిల్లా వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్స్ విభాగంలో విజేతలు...

కొప్పురావూరులో ప్రారంభమైన జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల బండ లాగుడు ప్రదర్శనలు నాలుగవరోజు శనివారం సబ్ జూనియర్స్ విభాగంలో జరిగాయి. ఈ ప్రదర్శనలో మొత్తం 11 జతలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా, ఖాజీపురం గ్రామానికి చెందిన ఓగనాటి ఓసురరెడ్డి ఎడ్ల జత 3000 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన పీఆర్ మెమోరియల్ పులగం త్రిషష్టురెడ్డి ఎడ్ల జత 2882.04 అడుగుల దూరం లాగి ద్వితీయస్థానంలోనూ రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌కు చెందిన వైపీఆర్ బుల్స్ యజమాని ఏల్చూల ప్రసన్నారెడ్డికి చెందిన ఎడ్ల జత 2774.10 అడుగుల దూరం లాగి తృతీయ స్థానంలో నిలిచాయని నిర్వాహకుడు తోట శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం చివరిరోజు సీనియర్స్ విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

పెదకాకాని: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా బావించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం నాగేశ్వరరావు అన్నారు. పెదకాకాని మండలం ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై ఫొటో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను పక్షులకేంద్రం చైర్మన్ పి అనిల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ ఎం ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. విద్యార్థులు మొక్కలు నాటడంతో పాటు వాటిని పెంచడం బాధ్యతగా స్వీకరించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ ఆవస్యకత, పర్యావరణ సమతుల్యత లోపం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా నిలవాలి

తహసీల్దార్ శ్రీకాంత్ కేధార్‌నాథ్



విద్యార్థులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న తహసీల్దార్

పొన్నూరు: పేద విద్యార్థుల ఉన్నతికి అందరూ సహాయ, సహకారాలు అందించాలని తహసీల్దార్ శ్రీకాంత్ కేధార్‌నాథ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని గోళ్ళమూడి పాడు గ్రామంలోని రాంబాబు బ్రాహ్మణకోడూరులోని అనాథ పిల్లల హోమ్‌కు నిత్యవసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇటువంటి సహాయ సహకారం అందించడం హర్షణీయం అన్నారు.

ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యం కోసం కృషి చేయాలి

రూరల్ డెవలప్‌మెంట్ డీజీ డాక్టర్ నరేంద్రకుమార్



గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలతో ఉన్నత స్థితికి ఎదగాలని నేషనల్ పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ డీజీ డాక్టర్ జి నరేంద్రకుమార్ తెలిపారు. శనివారం లాలుపురం గ్రామంలోని ఏఎస్ఆర్ పంక్షన్ హాలులో అమెరికన్ ప్రొగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తాను స్కాలర్‌షిప్‌లు తీసుకుని చదువుకున్నానని తెలిపారు. మంచి మార్కులు సాధిస్తే ప్రభుత్వం, ఇతర సంస్థలు స్కాలర్‌షిప్‌లు అందించి విద్యాభివృద్ధికి కృషిచేస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆప్తా అందిస్తున్న స్కాలర్‌షిప్‌లను సద్వినియోగించుకుని మంచి ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని లక్ష్యసాధనకు కృషిచేయాలన్నారు. మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్, సోషల్ మీడియాల వల్ల ఎంతో నష్టపోతున్నారన్నారు. ప్రతి ఒక్కరిలో నాయకత్వపు లక్షణాలు కలిగి ఉండాలన్నారు. ప్రతి రంగంలో నాయకత్వపు లక్షణాలు ఉంటే రాణించగలుగుతారన్నారు. నాయకులను తయారు చేసే ఇనిస్టిట్యూట్‌లు రావాలని అభిప్రాయపడ్డారు. తమిళనాడు మాజీ చీఫ్‌సెక్రటరీ రామ్‌మోహనరావు మాట్లాడుతూ కష్టంతోనైనా ఇష్టపడి చదివి తమ లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా 1150 మంది పేద విద్యార్థులకు రూ. 2.10 కోట్ల రూపాయల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆప్తా అధ్యక్షుడు సుబ్రమణ్యం, ఉదయభాస్కర్, శ్రీనివాస చందు, తోట ప్రసాద్, మధు దాసరి, దాసరి రాము, ఉగ్గిరాల సీతారామయ్య, ఉల్లి మధు, కె శ్రీనివాస్, ధనలక్ష్మి, వీరశేఖర్, బల్లా నరేంద్ర, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ ఉదయశంకర్, డాక్టర్ కృష్ణస్రవంత్, ఏ రామకృష్ణ, ఏ సతీష్ పాల్గొన్నారు.

నూతన ఆలోచనలతో లక్ష్య సాధన వైపు అడుగులు వేయండి

విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య



విజ్ఞాన్ యూనివర్శిటీలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న చైర్మన్ లావు రత్తయ్య

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ గడిచిన సంవత్సరంలో తాము సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని నూతన ఆలోచనలతో లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలని విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య తెలిపారు. శనివారం పెదపలకలూరు రోడ్డు లోగల విజ్ఞాన్ నిరుల కళాశాలలో నూతన సంవత్సరం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థిని, విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ రాధిక మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు ఎదురైనా లక్ష్యసాధనకు కష్టపడి కృషిచేయాలని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి అనూరాధ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ యూనివర్సిటీలో నూతన సంవత్సర వేడుకలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాలలోని విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కోటి ఆశలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించడానికి సరికొత్త మార్గాలను అన్వేషించాలన్నారు. నూతన టెక్నాలజీలపై అవగాహన పెంచుకున్న విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు దక్కుతాయని తెలిపారు. విద్యార్థులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి కేక్‌ను కట్ చేశారు. నూతన సంవత్సర వేడుక కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సాయం అభినందనీయం



పెదకాకాని: పదో తరగతి విద్యార్థును ప్రోత్సహించేందుకు రూ. లక్షరూపాయలు విరాళం అందజేయడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ కళ్యాణి అన్నారు. పెదకాకాని మండలం వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలకు బొంతు వేమారెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి పరమేశ్వరి, కుమారుడు సాంబిరెడ్డి మాధవిలు శనివారం లక్షరూపాయలు విరాళాన్ని హెచ్‌ఎం సీహెచ్ కళ్యాణికి అందజేశారు. లక్షరూపాయలు విరాళాన్ని పాఠశాల కమిటీ పేరిట బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి సంవత్సరానికి వచ్చే వడ్డీతో ప్రతి ఏటా పదో తరగతి పరీక్షల్లో ప్రథమస్థానం సాధించిన విద్యార్థికి గోల్డ్‌మెడల్(బంగారు పతకం) రూపంలో అందజేయాలని కోరారు. ఉత్తీర్ణతాశాతం పెంపొందించడంతో పాటు పాఠశాలలో ప్రతి ఏటా ప్రథమ స్థానంలో నిలిచేందుకు విద్యార్థుల మధ్య పోటీ పెరుగుతుందని హెచ్‌ఎం సీహెచ్ కళ్యాణి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కొండమడుగుల నాగజ్యోతిలు దాతలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదవాలి

డీఈఓ శైలజ



కాకుమాను: ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని జిల్లా విద్యాశాఖాధికారిణి పి.శైలజ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఈఓ శైలజ మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో రానున్న మూడు నెలల్లో విద్యార్థులు ఒక ప్రణాళికను రూపొందించుకుని దాని ప్రకారం చదువుకోవాలని ఆమె విద్యార్థులకు సూచించారు. విద్యలో పదో తరగతి ఒక పునాది అని అలాంటి పరీక్షలకు ప్రతి విద్యార్థి నేటి నుంచే కష్టపడి చదవాలని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పది విద్యార్థుల ప్రగతి వివరాలను పరిశీలించి, పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కెవిఫ్.కెనడీ.హెచ్ఎం టి.జోష్‌మేరి,ఉపాధ్యాయులు.





























నూతన సంవత్సర శుభాకాంక్షలు



ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: నూతన సంవత్సరంలో ప్రతి ఒక్క కుటుంబంలో వెలుగులు నిండాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ పొన్నూరు నియోజవకర్గంలో ఉన్న ప్రతి ఒక్కరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2023 సంవత్సరం అన్ని విధాల ప్రజలకు మంచి జరగాలని, ప్రతి కుటుంబం సుఖఃసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

మత్తు పదార్థాలు వినియోగిస్తే భవిష్కత్ అంధకారం

సెబ్ సూపరింటెండెంట్ అన్నపూర్ణ



పొన్నూరు: మత్తు పదార్థాలు వినియోగిస్తే భవిష్కత్ అంధకారం అవుతోందని గుంటూరు సెబ్ సూపరింటెండెంట్ అన్నపూర్ణ పేర్కొన్నారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మత్తు పదార్థాలు వాటి అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయన్నారు. తొలుత అవి ఆనందాన్ని ఇచ్చినా భవిషత్తులో శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు తలెత్తుతాయని వివరించారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకోని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ గీతిక, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం కోసం కృషిచేయాలి

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని వ్యక్తిత్వ వికాసాన్ని అభివృద్ధి చేసుకోవాలని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. శనివారం చౌడవరం గ్రామంలోగల కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో ఒక గొప్ప సంకల్పం ఉంటుందని ఆ సంకల్ప సాధన దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డీన్ డాక్టర్ సూర్యనారాయణ, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు, డాక్టర్ బి లక్ష్మి, తదితరులున్నారు.

ముగిసిన దశావతార కల్యాణ మహోత్సవం



గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వరాలయంలో ఆలయ సొసైటీ పాలకవర్గం ఆధ్వర్యంలో దశావతార కల్యాణ మహోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. చివరిరోజు శనివారం కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వరస్వామివారికి ప్రత్యేకంగా ఆలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో సుదర్శన యాగం చేశారు. భక్తులు దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణం చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదం అన్నప్రసాదం వితరణ చేశారు. కల్యాణ మహోత్సవంలో నగరలలోని భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు, ప్రధాన కార్యదర్శి మేడా సాంబశివరావు, కమిటీ చైర్మన్ కంచర్ల ఆంజనేయులు, గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, కోశాధికారి దేవరశెట్టి రామమోహనరావు, ఉపాధ్యక్షులు యర్రంశెట్టి వేణుగోపాల్, దేవరశెట్టి సత్యనారాయణ, ఆతుకూరి వెంకటేశ్వర్లు, దేవరశెట్టి సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు చిట్టిప్రోలు లోకేశ్వరరావు, కంచర్ల శంకరరావు, కూనిశెట్టి శ్రీనివాసరావు, కొండపాటూరి పిచ్చేశ్వరరావు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పొన్నూరు: రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకుకి గాయాలైన ఘటన మండల పరిధిలోని మామిళ్ళపల్లి అడ్డరోడ్డు సమీపాన శనివారం రాత్రి జరిగింది. బాధితులు తెలిపిన వివరాలమేరకు పొన్నూరు నుంచి మోదుకూరు బైక్ పై తండ్రి బషీర్దున్ కొడుకు సుభానీలు వెళ్తున్న సమయంలో మామిళ్ళపల్లి అడ్డరోడ్డు వద్దకు రాగానే పొన్నూరు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు బైక్‌ను వెనుక నుంచి ఢీ కొనడంతో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి వారిని చికిత్స నిమిత్తం 108లో గుంటూరులోని ఒక ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు

ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి గురవయ్య

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యరమైన పంటలను పండించడంతోపాటు మన ఆరోగ్యాలను కాపాడుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి కె గురవయ్య తెలిపారు. శనివారం మండలంలోని వెంగళాయపాలెం గ్రామం ఎల్ఎస్‌పురంలో ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయం, పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన పంటలు, న్యూట్రిగార్డెన్ గురించి అవగాహన కల్పించారు. సూర్య మండలం మోడల్ న్యూట్రీ గార్డెన్ వేయడం వల్లన పిల్లలకు పౌస్టికాహారం గురించి సులభంగా తెలుస్తోందని నేలపై సూర్యమండలం చిత్రించి వివరించారు. తాజాగా పెరిగిన కూరగాయల వినియోగం ద్వారా పోషకాహార లోపం - సూక్ష్మ పోషకాల లోపాలను పరిష్కరించడంలో సహాయం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రకతి వ్యవసాయం, తోటపనితో పిల్లలకు మొదటి అనుభవాన్ని అందించడం జరుగుతుందన్నారు. కూరగాయల పోషక అంశాలు, జంక్ ఫుడ్‌లోని హానికరమైన ప్రభావాలకు సంబంధించి పిల్లల జ్ఞానాన్ని మెరుగుపరచడంలో కూడా ఉపయోగ పడుతుందన్నారు. సూర్య మండలంలో అన్ని రకాల ఆకుకూరలు, దుంప జాతి, తీగ జాతి వేయడం జరిగింది. మధ్యాహ్న భోజనంలో పోషకాలు ఉండే విధంగా అన్ని రకాల కూరగాయలతో ప్రకతి వ్యవసాయ విధానాలపే వివరించారు.







